www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 ఫిబ్రవరి 2023

5

ఏలూరు




పిహెచ్‌సిలో ఆర్‌డిఒ తనిఖీలు

జీలుగుమిల్లి: మండలంలోని కామయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం వసతులపై ఆరా తీశారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒపి, స్టాక్ రిజిస్టరును పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.ఎలీషా, ఆసుపత్రి సిబ్బంది, విఆర్‌ఒ అశోక్ పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఝాన్సీరాణి

వైసిపిలో గ్రూపుల పోరు



- కొనసాగుతున్న గ్రూపు విభేదాలు
- మూడేళ్లుగా కొలిక్కిరాని పరిస్థితి
- చక్కదిద్దడంలో అధిష్టానం విఫలం
- గందరగోళంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు
- ఇప్పటికే విడుదలైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్
- ఈసారి రాజకీయాలు రసవత్తరమే
- ఉమ్మడి జిల్లాలో సర్వత్రా ఎన్నికల చర్చ

ప్రజాశక్తి - భీమవరం

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ వెలువడింది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలపై సర్వత్రా చర్చ జరుగుతుంది. ఇదిలా ఉంటే అధికార పార్టీలో కలహాలు, అంతర్గత విభేదాలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. బరిలో ఉండేది ఎవరు.. ఉన్నా.. గెలిచేది ఎవరు అన్న చర్చ గ్రామగ్రామాన నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీలుగా ఉన్న అంగర రామ్మోహన్‌రావు, టి.సత్యనారాయణరాజు (పాందువ శ్రీను) పదవీ కాలం వచ్చేనెల మూడో తేదీతో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ రెండు స్థానాలు ప్రస్తుతం టిడిపికి చెందిన ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈసారి ఈ ఎన్నికల్లో వీటిని వైసిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉంటారు. ఎంఎల్‌సి ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరగడం, ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ వైసిపికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉండటంతో రెండు స్థానాలు ఆ పార్టీ కైవసం చేసుకునే అవకాశాలున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ కూడా ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆశావాహులు ఎవరికి వారే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రముఖంగా కొన్ని పేర్లు వినబడుతున్నప్పటికీ మిగిలిన ఆశావహులు తమదైన రీతిలో పావులు కదుపుతున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. తాము పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నామని కొందరు గొప్ప అంటుంటే.. మరికొందరు సామాజికంగా ఆర్థికంగా తామే గొప్ప అంటూ బలాలను నిరూపించుకుంటున్నారు. ఇలా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలపై కూడా తీవ్ర చర్చ జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో గ్రామ గ్రామాన ఎన్నికలపై చర్చలు, సమావేశాలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే అధికార వైసిపిలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ముసలం తాజాగా తెరపైకి వస్తుంది. పార్టీలో నాయకులు మధ్య కలహాలు అంతర్గత విభేదాలు మరోసారి బయటపడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో అధికార వైసిపిలో భగ్గుమంటున్న గ్రూపు విభేదాలు

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేపట్టాలన్నా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపైనే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ఏ పార్టీకి క్లీన్ స్వీప్ వస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందని చెబుతుంటారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 15 స్థానాలు టిడిపి కైవసం చేసుకుంది. 2019లో ఉండి, పాలకొల్లు స్థానాలు మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లో వైసిపి పాగా వేసింది. అయితే రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో స్థానాలను కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా ఆయా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఇలా ఉంటే అధికార పార్టీలో ఏర్పడిన ముసలం, నేతల మధ్య కలహాలు, వర్గ విభేదాలు తాజాగా తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ముఖ్యనేతలు అయోమయంలో పడ్డారు. పాలకొల్లు నియోజకవర్గంలో గత నుంచి గ్రూపు పోరు నడుస్తుంది. ఈ తరుణంలో అధిష్టానం పలుమార్లు హెచ్చరించినప్పటికీ కిందిస్థాయి కేడర్, వీరికి నాయకత్వం వహిస్తున్న నాయకులు బేఖాతర్ చేస్తున్నారు. ఇక్కడ పార్టీ ఓటమి పాలవడంతో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన నేతృత్వంలో పార్టీ నేతలు ఉమ్మడి కార్యాచరణకు రావాలని, పార్టీ బలం పెరిగేలా వ్యవహరించాలని అధిష్టానం ఆశించినప్పటికీ పెడచెవిన పెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కవురు శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా కొందరు నేతలు వ్యవహరిస్తున్నారు. ఆయన తగిన సమాచారం ఇవ్వడం లేదని, కొందరికే మాత్రమే ప్రాధాన్యతిస్తూ మరికొందరిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జిగా ఉన్న కవురు శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ తాతాజీ ఎవరికివారే యమునా తీరు అన్నట్లు వ్యవహరిస్తూ వారి సొంత కార్యక్రమాలకే ప్రాధాన్యతిస్తూ ముందుకు సాగడంతో పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మూడేళ్ల నుంచి పార్టీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

మెట్ట ప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గ వైసిపిలో అసంతృప్తి సెగలు ఎగిసిపడుతున్నాయి. స్థానిక ఎంఎల్‌ఎ ఎలీజకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా ఇంకొందరు గ్రూపు రాజకీయం నడుపుతున్నారు. ఆయన అనుయాయులపై గతంలో అనేక అవినీతి ఆరోపణలు కూడా వినిపించాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే నియోజకవర్గంలో ఎంపి కోటగిరి శ్రీధర్ (గ్రూపు) నేతలు, ఎమ్మెల్యే (గ్రూపు) నేతలు విడిపోయి ఎవరికివారు వారు తమదే పెత్తనం సాగాలంటూ వ్యవహరిస్తున్నారు. అయితే ఈ వ్యవహారం అంతా అధిష్టానం దృష్టికి వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోనూ తరచూ అంతర్గత విభేదాలు తెరపైకి వస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు ఎవరిని అడిగినా ఠక్కున పివిఎల్.నరసింహరాజు అని చెబుతుంటారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పివిఎల్‌కు పార్టీ బాధ్యతలను అప్పగించింది. కొద్దికాలం తర్వాత ఆ బాధ్యతల నుంచి పివిఎల్‌ను తప్పించింది. ఆ స్థానంలో సీనియర్ నేత గోకరాజు రామరాజుకు పార్టీ బాధ్యతలు అప్పగించింది. ఇక్కడ ఒక మాజీ ఎమ్మెల్యే సర్రాజును కూడా పక్కన పెట్టారు. అయితే సర్రాజుకు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని అప్పగించారు. ఇలా నియోజకవర్గంలో అధికార వైసిపిలో గ్రూపులు ఏర్పడటం, పివిఎల్‌కు అనుకూలంగా కొందరు, రామరాజుకు ఇంకొందరు వ్యవహరిస్తున్నారు. ఇది కాస్తా ముదిరి పాకాన పడటంతో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభ సమయంలో మళ్లీ పార్టీ బాధ్యతలను అధిష్టానం డిసిసిబి ఛైర్మన్‌గా ఉన్న పివిఎల్‌కు అప్పగించింది. ఈ క్రమంలో జిల్లాలోనే పివిఎల్ ముందు వరుసలో ఉండి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. అయితే గ్రూపు విభేదాలు మాత్రం తరచూ వెంటాడుతుండటంతో వైసిపి నాయకుల్లో, కార్యకర్తల్లో అసంతృప్తి సెగలు అలానే కొనసాగుతున్నాయి. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకుతో పాటు ఏలూరు జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో గ్రూపు విభేదాలు, పార్టీలో అంతర్గత కలహాలు నివురుకప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్టానం ఏ విధంగా చక్కదిద్దుతుందో వేచిచూడాలి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధిష్టానం ఈ జిల్లాపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

ఎన్‌హెచ్‌పిసి నివేదిక రాగానే

పోలవరం పనులు వేగవంతం

త్వరలో నిపుణుల బృందం నివేదిక


పోలవరం ప్రాజెక్టు పరిశీలనలో మంత్రి అంబటి

ప్రజాశక్తి - పోలవరం

డయాఫ్రంవాల్‌కు సంబంధించిన నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పిసి) నివేదిక రాగానే పోలవరం ప్రాజెక్టు పనులు ఊపందుకుంటాయని రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. గురువారం రాత్రి ప్రాజెక్టుకు చేరుకొన్న మంత్రి పోలవరం ప్రాజెక్టు అతిథి గృహంలో బస చేశారు. ఉదయం ప్రాజెక్టు నిర్మాణంలో స్పిల్ వే, అప్రోచ్ ఛానల్, డి వాల్ గైడ్ బండ్, దిగువ కాపర్‌డ్యామ్, నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ నిపుణులు డయాఫ్రంవాల్ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రాంతంలో పనులను పరిశీలించి సంబంధిత వివరాలను సిఇ సుధాకర్‌బాబును, ఎస్ఇ నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే పోలవరం ప్రాజెక్టు జాప్యానికి కారణమని విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రధానమైన ఎర్త్ కంరాక్‌ఫిల్ డ్యాం నిర్మాణానికి డయాఫ్రం వాల్ పెద్ద సమస్యగా పరిణమించిందని, దీని నిర్మాణ విషయంలో ఎంత మేర దెబ్బతింది, దెబ్బతిన్న మేర మరమ్మతులు నిర్వహించాలి, లేక డయాఫ్రంవాల్ పున:నిర్మించాలా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. గత నెలలో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు ప్రారంభించిన పరీక్షల వివరాలు, నిపుణుల నివేదికలు వచ్చేవరకూ పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నివేదికలు రావడానికి 15 రోజుల సమయం పడుతుందన్నారు. డయాఫ్రంవాల్ స్థితిగతుల అంచనా పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ పరిహారం విషయంలో నిర్వాసితులకు 1800 పునరావాస కాలనీలు తమ ప్రభుత్వ పాలనలోనే నిర్మించామని చెప్పారు. 41.17 కాంటూరు పరిధిలో నిర్వాసితులకు రెండో ఫేజ్‌లో పూర్తిస్థాయి పరిహారాలు అందిస్తామని, ఇప్పటికే రూ.మూడు వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించి కేంద్ర ప్రభుత్వం నుండి రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏ పనులు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం నిధులిస్తేనే సాధ్యమన్నారు. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ నిపుణుల బృందం నివేదికను అనుసరించి డయాఫ్రమ్ వాల్ పనులపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముగ్గురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం డయాఫ్రమ్ వాల్‌కు జరిగిన నష్టాన్ని పరిశీలించిందేందుకు గత నెల 26న వచ్చిందన్నారు. రెండు, మూడు వారాల్లో బృందం నివేదికను అందిస్తుందని, దాని ప్రకారం డయాఫ్రమ్‌వాల్‌కు మరమ్మతులు చేయడమా లేక కొత్తది నిర్మించాలా అన్నది నిర్ణయిస్తామన్నారు. కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మించాల్సి వస్తే పోలవరం ప్రాజెక్ట్ పనులు మరింత జాప్యమయ్యే అవకాశం ఉందన్నారు. గత సంవత్సరం వచ్చిన వరదల సమయంలో ఎగువ కాపర్ డ్యామ్‌ను యుద్ధప్రాతిపదికన మీటరు ఎత్తు పెంచామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం అతిక్లిష్టమైనదని, అది దెబ్బతినడంతో ప్రాజెక్టు నిర్మాణం పనుల్లో వేగం తగ్గిందన్నారు.

కర్నాటకలో చేపడుతున్న అప్పర్‌భద్ర ప్రాజెక్ట్‌ను వైసిపి ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని మంత్రి చెప్పారు. తుంగభద్ర నది ఎగువన కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్ ద్వారా రాష్ట్రానికి వచ్చే కృష్ణా నది సాగు జలాల కేటాయింపులో మన రాష్ట్రానికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌పిసి బృంద సభ్యులు విపుల్, ఎన్‌కె.పాండే, ఎంపి సింగ్, మేఘా సంస్థ ఇంజినీర్ అనంత్‌ను మంత్రి సత్కరించారు. ప్రాజెక్ట్ ఇంజినీర్లతో కలిసి లోయర్ కాపర్ డ్యామ్, డయాఫ్రమ్‌వాల్, జెట్ గ్రౌండింగ్, గైడ్ బండ్ పనులను పరిశీలించారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఉద్యోగులతో చెప్పులు మోయించడం రోజాకు సరికాదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా తన శాఖలోని ఉద్యోగితో చెప్పులు మోయించడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. చలనచిత్ర కళాకారిణిగా రోజా అంటే ఎంతో గౌరవం ఉండేదన్నారు. శాసనసభ్యురాలిగా, అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన ప్రవర్తన తీరు మహిళలు వేలెత్తి చూపే విధంగా ఉందన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన రోజా ఎంత ఎదిగిన ఒదిగే స్వభావం తనదని చెప్పుకుంటున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆధునికయుగంలో ఆచితూచి అడుగు వేయాల్సిన ఆమె ఫ్యూడల్ కాలం నాటి మహారాణిలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తీరు మారకపోతే భవిష్యత్‌లో ఆమెకు మహిళలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఆర్‌కె రోజా బాపట్ల ప్రాంతంలో సూర్యలంకలో పర్యటిస్తున్న నేపథ్యంలో నీటిలో నడుస్తున్న ఆమె చెప్పులు విడిచి నీటిలో నడుస్తుంటే పర్యాటక శాఖకు చెందిన ఉద్యోగి ఆమె చెప్పులు చేత పట్టుకుని వెళుతుంటే రోజా చూస్తూ ఊరుకున్నారు మినహా చెప్పులు పట్టుకోవడం ఆపకపోవడం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఆమెకున్న సంపన్నవర్గ స్వభావాన్ని తానే రుజువు చేసుకుందని ఎద్దేవా చేశారు. ఉద్యోగుల పట్ల రోజా అనుసరించిన వైఖరిని సీనియర్ బుర్రకథ కళాకారులు ప్రజానాట్యమండలి ఉమ్మడి జిలా గౌరవ అధ్యక్షులు సబ్బి కనకారావు, వీరమల్ల సత్యనారాయణ, బి.నందకుమార్, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ తీవ్రంగా ఖండించారు.

విభజన హామీల అమల్లో కేంద్రం విఫలం

ప్రజాశక్తి - చింతలపూడి

ఎపి విభజన హామీల అమల్లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి సరైన నిధులు కేటాయించపోవడానికి నిరసనగా సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో చింతలపూడి స్టేట్ బ్యాంక్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న ఎపికి ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణానికి నిధులు, వెనుకబడిన ఉతరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక నిధుల ప్రస్తావనే లేదన్నారు. స్టేట్ బ్యాంక్ ఎల్‌ఐసి నుంచి ఆదానికి రూ. కోట్లు పెట్టుబడులు పెట్టించి ఆదాని దివాలా తీస్తే ఆ భారం ఎవరిపై మోపుతారని ప్రశ్నించారు. ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి దంతా కృష్ణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి సరైన నిధులు కేటాయించకపోగా అనేక కోతలు విధించారన్నారు. సోమనాధన్ కమిషన్ సిఫార్సులు అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోడ వజ్రం, ఎస్‌కె జాని రామకృష్ణ, ఇస్తరాకులు వెంకటేశ్వరావు, కొలుకుపోం నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, తక్కిలపాటి ప్రసాద్ పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న నాయకులు

ఇంటి విలువ మూడు రెట్లు పెంచాలి

గ్రామసభలో పోలవరం నిర్వాసితుల డిమాండ్

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోతున్న తమకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు ఇచ్చిన పరిహారం మాదిరిగానే ఇంటి విలువలు ప్రస్తుతం ఉన్న మార్కెట్ రేటుకన్నా మూడురెట్లు పెంచి ఇవ్వాలని బోనగిరి నిర్వాసితులు గ్రామసభలో అధికారులను డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు మొదటి విడత ముంపులోని 41.15 కాంటూరులోని ఎనిమిది గ్రామాల్లో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 16 వరకూ మండలంలోని బోనగిరి, రామచంద్రపురం, గంపెనపల్లి, గొమ్ముగూడెం గ్రామాల్లో ఇంటి విలువలపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం బోనగిరి, రామచంద్రాపురంలో ఇంటి విలువలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఏలూరు ఎస్‌డిసి కార్యాలయ అధికారులు గ్రామసభలు నిర్వహించి నిర్వాసితుల నుండి ఆధార్, రేషన్, 2015, 16, 17 సంవత్సరాల ఇంటిపన్ను రసీదులు, బ్యాంక్ ఖాతా పుస్తకాలను పరిశీలించారు. బోనగిరి గ్రామసభలో నిర్వాసితుడు సున్నం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న తమ ఇళ్లకు, స్థలాలకు, చెట్లకు విలువలు ఎంత కట్టారో సమాచారం తెలియచేయకుండా గ్రామసభలు ఏంటని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు వచ్చే గ్రామసభలో పూర్తి వివరాలు తెలియచేస్తామని హామీ ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని గ్రామ సభ అధికారులకు నిర్వాసితులు అందించారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

10కె రన్ పోటీలకు శ్రీసీతారామ విద్యార్థులు

ప్రజాశక్తి - దెందులూరు

ఈ నెల 12వ తేదీ నుంచి బెంగళూరు ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో నిర్వహించే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ క్రాస్ కంట్రీ (పది కిలోమీటర్ల రన్) పోటీల్లో పాల్గొనే జట్టుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గోపన్నపాలెం శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పివికెడి.ప్రసాద్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియేల్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు అత్యంత నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా తిరిగి రావాలని ఆశించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన కిట్లను పంపిణీ చేశారు. గత నెల 21వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ప్రతిభ కనపరచిన వారిని అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయ పోటీలకు ఎంపిక చేసినట్లు క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పివికెడి.ప్రసాద్ తెలిపారు. ఈ టీమ్‌కు మేనేజర్‌గా ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన జట్టుతో వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు

169 మందికి కళ్యాణమస్తు, షాదీ తోఫా

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు ద్వారా, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్‌ఆర్ షాదీతోఫా ద్వారా ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జిల్లాల వారీగా వారి ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో ఈ పథకం కింద అక్టోబరు 1, 2022 తర్వాత జరిగిన వివాహాలకు 240 మంది నమోదు చేసుకోగా 169 మంది లబ్ధిదారులకు రూ.145.30 లక్షలు మంజూరు చేశారు. వీటిలో కులాంతర వివాహం కింద 28 మంది దంపతులకు రూ.27.30 లక్షలు, మైనార్టీలు ఇద్దరికి రూ.2 లక్షలు, ఒకే కులానికి చెందిన 139 మంది దంపతులకు రూ.116 లక్షలు మంజూరయ్యాయి. ఈ పథకం కింద ఎస్‌సి కులాల ఆడ పిల్లలకు రూ.లక్ష, ఎస్‌సి (కులాంతర వివాహానికి) రూ.1.20 లక్షలు, ఎస్‌టి కులానికి రూ.లక్ష, ఎస్‌టి కులాంతర వివాహాలకు రూ.1.20 లక్షలు, బిసి కులానికి రూ.50 వేలు, బిసి కులాంతర వివాహానికి రూ.75 వేలు, మైనారిటీలకు రూ.లక్ష, విభిన్న ప్రతిభావంతులకు రూ.1.50 లక్షలు, ఇతర భవన నిర్మాణ కార్మికుల ఆడ పిల్లలకు రూ.40 వేలు ఈ పథకం ద్వారా అందిస్తున్నారు. ఈ కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు రూ.1,45,30,000 చెక్కును డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్‌వి.నాగరాణి, జిల్లా మైనారిటీస్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్‌ఎస్.కృపావరం కలిసి లబ్ధిదారులకు అందించారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ప్రజాసంఘాల నాయకులు



కూలీలతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - వేలేరుపాడు

పేద, బడుగు, బలహీన ప్రజలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మండలంలోని మద్దిగట్ల గ్రామ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి గిరిజన సంఘం, సిఐటియు సంఘాల నాయకులు కారం వెంకట్రావు, ధర్మల రమేష్, మడివి దుర్గారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సరైన సదుపాయాలు అందుతున్నాయా లేదా అని ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపాధి హామీ కూలీలకు తీవ్ర నష్టం కలిగించేలా ఉందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్‌లోనూ రైతులకు వ్యవసాయ రంగానికి నిధుల కోత పెట్టి ఆ రంగాలను సంక్షోభంలోకి నెట్టిందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూలీలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టానికి మొన్న బడ్జెట్‌లో కేటాయింపులు సగానికి సగం కోత పెట్టారని, అవి పాత బకాయిలు చెల్లించడానికి కూడా సరిపోవని దుయ్యబట్టారు. రానున్న కాలంలో ఉపాధి హామీని నిర్వీర్యం చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. వ్యవసాయ కూలీలందరూ ఐక్యంగా పోరాడి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో ఎపికి అన్యాయం : సిపిఐ

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేశారని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ, అదానీ ఆస్తులు జప్తు చేయలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎపికి తీరని అన్యాయం చేశారని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవారికి నష్టం కలిగిస్తూ ధనవంతులకు మేలు చేసేలా బడ్జెట్ ఉందని వాపోయారు. అదానీ ఆర్థిక అవకతవకలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అదానీ ఆస్తులు వెంటనే జప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి యర్రా మధు, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు పిట్టా సాయామ్మ, కరటం వెంకటేశ్వర్లు, ఎస్‌కె గౌస్, తుర్సం సురేష్, ముత్యాలు, సత్తిబాబు పాల్గొన్నారు.



బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

చెరువులను ఆక్వా జోన్‌లోకి చేర్చాలి : జెసి


ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర సర్వే నిర్వహించి నాన్ ఆక్వా జోన్‌లోని ఆక్వా చెరువులను ఆక్వా జోన్‌లోకి చేర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధ్యక్షతన మత్స్యశాఖ జిల్లాస్థాయి కమిటీ(డిఎల్‌సి) సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా కార్యకలాపాలు నిర్వహించకూడదని, ఆక్వా ఉత్పత్తి, ఉత్పాదకను పెంచడం ఆక్వా కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో మౌలిక వసతులు అభివృద్ధి తదితర లక్ష్యాలతో 2020లో ప్రభుత్వం ఆక్వాజోన్‌ను నోటిఫై చేసిందని తెలిపారు. ఆక్వా జోన్ గెజిట్‌లో పేర్కొన్న సర్వే నెంబర్లను ఆనుకొని ఉన్న ఈ ఫిష్ సర్వే డేటాలో విస్తీర్ణ, ఆక్వా చెరువులను జోన్ పరిధిలోకి తీసుకువచ్చే అంశాలపై కమిటీలో చర్చించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వాటి ఫొటోలతో సహా సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిపిఒ (డిఎఫ్ఒ) ఇన్‌ఛార్జి జివికె.మల్లికార్జునరావు, సిఐఎఫ్ఎ అజిత్ పాల్గొన్నారు.

అక్కౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో రెండు అక్కౌంటెంట్ గ్రేడ్-3 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఈ నెల పదో తేదీన జారీ చేస్తున్నట్లు జెసి పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన అభ్యర్థులందరూ eluru.ap.gov.in/notice category/recruitment లింక్ ద్వారా వివరాలు తెలుసుకొని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

సొసైటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కైకలూరు

రైతులకు అన్ని విధాలుగా వైసిపి ప్రభుత్వం మేలు చేస్తుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పల్లెవాడలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అవసరమైన చోట్ల పిఎసిఎస్ బిల్డింగులు నిర్మాణం జరుపు కోగలుగుతున్నామని, ఇందుకు సహకరిస్తున్న కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షులు తన్నీరు నాగేశ్వరరావుకు, బ్యాంకు ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసిన స్థానిక పిఎసిఎస్ త్రిసభ్య కమిటీని అభినందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు మరింత మేలు చేసే విధంగా పిఎసిఎస్‌లు పనిచేసి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దుట్టా మణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు దండే పుష్పలత, కెడిసిసి బ్యాంక్ మేనేజర్ రాజు, వైసిపి మండల అధ్యక్షులు బత్రాజు శివాజీ పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన

ప్రజాశక్తి - చాట్రాయి

ఉపాధి హామీ చట్టం పనుల్లో భాగంగా మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో కూలీలు పంట కాలవ పనులు చేశారు. పంట పొలాలకు నీరు వెళ్లే కాలువలు చెట్లతో మూసుకుపోవడంతో శుక్రవారం ఉపాధి హామీ పనుల కూలీలు మరమ్మతులు చేసి పంట కాలువలను శుభ్రపరిచారు. ఈ పనులను ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్ పరిశీలించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు తమ ఆరోగ్య రక్షణ కోసం పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని గణపవరం ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌నాయుడు మాట్లాడుతూ 74 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వీరిలో 18 మందికి ఇబ్బందికరంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మాతృత్వ అభయ కార్యక్రమం సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులందరికీ ప్రొటినిక్స్ పౌడర్, పోషక విలువైన ఆహారం అందరికీ అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గణపవరం అధ్యక్షులు చవ్వా రవికుమార్, క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, క్లబ్ కోఆర్డినేటర్ వెల్లంకి నరేష్, సిహెచ్‌ఒ జె.విల్సన్‌బాబు, వరలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని బొర్రంపాలెంలో శుక్రవారం హైస్కూల్ విద్యార్థులకు నేర నియంత్రణలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటైతే జీవితాలు నాశనం అవుతాయని హితవు పలికారు. పాఠశాల వద్ద ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు నేరాలకు పాల్పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి మండలంలో జగనన్న లే అవుట్‌లలో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి కావడానికి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ఆర్‌బికె కేంద్రాలు, వైఎస్ఆర్ క్లినిక్‌లు, సచివాలయ భవనాలు నాడు-నేడులో అదనపు తరగతి గదుల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ రాజ్‌మనోజ్ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి కూరపాటి విక్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహాల నిర్మాణంలో లబ్ధిదారులతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యత తీసుకుని సిమెంట్, ఇసుక సకాలంలో సరఫరా చేయిస్తే లబ్ధిదారుల్లో చైతన్యం పెరిగి గృహాలు వేగంగా నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. దశల వారీగా చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ఎంపిడిఒ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

కర్నూలు జిల్లా డోన్ బార్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులు పులి దామోదర్‌పై జరిగిన హత్యాయత్నాన్ని భీమడోలు బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. శనివారం కూడా బహిష్కరించనున్నట్లు తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడినవారిపై ఐపిసి 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి శిక్షించాలని వారు కోరారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గర్భిణులకు, ఎనిమియా రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపిడిఒ మణికుమారి అన్నారు. మండలంలోని రాఘవపురం పిహెచ్‌సిని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు వైద్య సిబ్బంది రావాలని చెప్పారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు.

నేరాలు - ఘోరాలు

విద్యార్థికి గాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆడుకుంటూ కింద పడటంతో బాలుడి చేతికి గాయమైన ఘటన మండలంలోని కామయ్యపాలెం జిల్లా ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... పి.అంకంపాలెం గ్రామానికి చెందిన సాయి రాజేష్ పాఠశాలలో శుక్రవారం ఆడుకుంటుండగా కిందపడ్డడు. దీంతో అతని చేతికి గాయమైంది. పాఠశాల సిబ్బంది వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం కామయ్యపాలెం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం 108లో జంగారెడ్డిగూడెం సాయి స్ఫూర్తి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

పాఠశాలలో డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ ద్వారానే విద్యాభోధన నిర్వహించాలని జిల్లా విద్యాశాఖధికారి ఎంవి.అవధాని అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యా భోధన గురించి, సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాళశాలలో జరుగుతున్న ఎఫ్ఎ3 పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులతో పాటు మెరుగైన విద్యను అధించాలన్నారు. అనంతరం పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అప్పిరెడ్డి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో హత్య

ప్రజాశక్తి - ముసునూరు



నాగుల్‌మీరా



జోత్న్స మృతదేహం

ముసునూరు మండలంలో చోటు చేసుకున్న హత్యలతో మండల వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల ఎల్లాపురంలో హత్య, కాట్రేనిపాడులో జంట హత్యలు చోటు చేసుకున్నాయి. గురువారం రాత్రి రమణక్కపేటలో మరో హత్య ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రమణక్కపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి జోత్న్స (29), కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన నాగుల్ మీరా అనే ముస్లిం యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. నాగుల్ మీరా సోదరిని రమణక్కపేటకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేయడంతో నాగుల్‌మీరా రమణక్కపేట వస్తుండేవాడు. ఈ క్రమంలో నాగుల్‌మీరా, జోత్న్స ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. నాగుల్‌మీరా తిరువూరులో తాపీ పనులు చేస్తూ ఉంటాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి ఇద్దరు తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. దీంతో జోత్న్స కొన్ని నెలల నుంచి రమణక్కపేటలోనే ఉంటుంది. తన భార్యపై అను మానంతో నాగుల్‌మీరా గురువారం రాత్రి రమణక్కపేట వచ్చి జోత్న్సను కత్తితో పొడవతంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నాగల్‌మీరా అక్కడి నుంచి పరారయ్యాడు. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ ఆర్.అంకబాబు తెలిపారు.

అధికారుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

మండవల్లి సర్వసభ్య సమావేశంలో ఎంపిపి శ్రీరామదుర్గాప్రసాద్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి - మండవల్లి

అభివృద్ధి పనుల్లో అధికారులు భాగస్వామ్యం అయినప్పుడే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక గ్రామ ఐక్య సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో ఎంపిటిసి సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఎంపిటిసిలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మండవల్లిలో నిర్వహిస్తున్న విస్తరణ పనులను గుత్తేదారుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, కుళాయి పైపులైను ధ్వంసం చేయడం వల్ల తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, విస్తరణ పనులు నిర్వహించేటప్పుడు పంచాయతీ అధికారులకు తెలియజేసి వారి సమక్షంలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోరి అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సకాలంలో అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు అధికారులు, కార్యదర్శులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలన్నారు. అనంతరం విద్య, వైద్యం, ఉపాధి పనులు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అగస్తి ఆది విష్ణు, జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పలు శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బలివే ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు



బలివేలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్



భోగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌పి

మండలంలోని బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ట్రెయినీ కలెక్టర్ ఆపూర్వ బర్త్ శుక్రవారం పరిశీలించారు. ఎంపిడిఒ జి.రాణి, ఆలయ ఇఒ టి.విశ్వేశ్వరరావులతో కలిసి జల్లు స్నానాల ఏర్పాటు, తమ్మిలేరుపై ఉన్న తాత్కాలిక వంతెన నిర్మాణం ఏర్పాట్లను పరిశీలించారు. శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఎస్ పి

కలిదిండి : ఈ నెల 18వ తేదీన నిర్వహించే శివరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ శుక్రవారం పరిశీలించారు. ఆలయానికి భక్తులు వచ్చి వెళ్లే రహదారులు, ఆలయం వద్ద బారి కేడింగ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించి భద్రతా పరమైన పలు సూచనలు చేశారు. పోలీస్ వారి సూచనలు భక్తులు పాటించాలన్నారు. ట్రాఫిక్‌కి ఎటువంటి అంతరాయం లేకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. తొలుత ఎస్‌పి రాహుల్ దేవ్‌శర్మకు ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, కైకలూరు రూరల్ సిఐ వైవిఎల్.నాయుడు, కలిదిండి ఎస్ఐ మణికుమార్, పోలీస్ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పేదలకు భూహక్కు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు



ఆందోళన చేస్తున్న రైతులు

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీరఘునాధస్వామి ఆలయ పరిధిలోని భూముల్లో సాగులో ఉన్న చిన్న కారు రైతాంగానికి భూ హక్కులు కల్పించాలని రైతాంగం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు గొల్లపల్లి గ్రామంలోని ఎండోమెంట్ కార్యాలయంలో ఇఒ ఎల్లాప్రగడ విశ్వేశ్వరరావుకు శుక్రవారం వినతి పత్రం అందించారు. వేంపాడు అగ్రహారంలో ఉన్న శ్రీ రఘునాథస్వామి భూములు సాగు చేస్తున్న సన్న చిన్న కారు రైతాంగం రామదండుగా ఏర్పడి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు ఒరుగు శ్రీరంగం, పానుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ బడా భూస్వాములకు వందలాది ఎకరాలకు భూ హక్కులు కల్పించి, పట్టాదారు పాసుపుస్తకాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. నిజమైన సాగుదారులుగా ఉన్న సన్న చిన్న కారు రైతులకు భూ హక్కులు కల్పించాలంటే నియమ నిబంధనలు అడ్డు వస్తున్నాయని అధికారులు కుంటి సాకు చెప్పడం తగదన్నారు. స్థానికేతరులైన కబ్జాదారులు బినామీ వ్యక్తులతో సాగు చేయిస్తూ, పట్టాలు అధికారులు ఎలా మంజూరు చేశారని రైతన్నలు ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు. సాగు చేస్తున్న భూముల్లో తమకు హక్కులు కల్పించే వరకు ఆందోళన విరమించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

అంగన్‌వాడీలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి - నూజివీడు

తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గమని ఏలూరు పార్లమెంట్ అంగన్‌వాడీ డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షురాలు కొమ్మని విజయ అన్నారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చే బహుమతి ఇదేనా అని ప్రశ్నించారు. వెట్టి చాకిరి చేయించుకొని సమస్యలను పరిష్కరించమంటే వేధింపులకు గురిచేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా సంపూర్ణ పోషణ పథకం అమలుకు నిధులు విడుదల చేయకుండా చిన్నారులకు నాణ్యమైన భోజనం పెట్టాలని అంగన్‌వాడీలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు టిడిపి అండగా నిలుస్తుందన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూజివీడు సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంగన్‌వాడీ డ్వాక్రా సాధికార కమిటీ సెక్రటరీ సయ్యద్ నజీమ్ మున్నిసా, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళ కమిటీ సభ్యులు దుర్గాదేవి, శీలం పద్మ, జాలాది సుధారాణి, జొన్నలగడ్డ శివలక్ష్మి, రాధా కుమారి పా ల్గొన్నారు.

POST ADOPTION ANNOUNCEMENT

We are going to replace biological father name **Venkata Rama Reddy Dwarampudi,** with the step father name **Lakshmi Narayana Reddy Dwarampudi** in our minor child passport (passport number-p3735120). The adoption document (BK-4, CS No 2/2023 & Doct no 2/2023) got registered at sub register office with the consent of biological father i.e Venkata Rama Reddy Dwarampudi.

LAKSHMI NARAYANA REDDY DWARAMPUDI (z6910247)
and my wife LAKSHMI NAGA KALYANI (w8108260)

నాణ్యతా ప్రమాణాలు పాటించండి : ఎంఎల్ఎ కొఠారు

ప్రజాశక్తి - పెదవేగి(దెందులూరు)

రోడ్డు నిర్మాణ, మరమ్మతుల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి సూచించారు. పెదవేగి మండలం జానంపేట నుంచి కొప్పులవారిగూడెం ఏడో మైలు రాయి వరకు నూతనంగా వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించి, పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ఎంఎల్ఎ కోరారు.

డాక్యుమెంట్స్ పోయినవి

మొరమర్ల సత్యన్నారాయణ, తండ్రి: చిట్టియ్య అను నేను ది. 20-12-2022వ తేదీన పూళ్ళ నుండి భీమడోలు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసునకు సలహా నిమిత్తం వెళ్తుండగా దారి మధ్యలో మా తల్లి గార్కి చెందిన **నెం. 2422/2008** గల ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది చిరునామాకు తెలియపర్చగలరు.

మొరమర్ల సత్యన్నారాయణ
పూళ్ళ, ఏలూరు జిల్లా
సెల్: 7993035234, 9346900055

రైతులందరూ ఇ-పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని రైతులు ఈ నెల 26వ తేదీలోగా ఇ-పంట నమోదు కార్యక్రమం పూర్తి చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి భీమడోలు శాఖ ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ కోరారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండల సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఇ-పంటలో నమోదైన రైతులకు ప్రభుత్వపరంగా కల్పించే సౌకర్యాలు, రాయితీలు, ఇతరాలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద యూరియా, ఇతర ఎరువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. డిమాండ్ మేరకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులను అదనంగా సిద్ధం చేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల వారీగా ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో కస్టం హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు ఎం.రూపాదేవి పాల్గొన్నారు.

మండవల్లి : రైతులు మినుము పంటను తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకురాలు జి.వెంకటమణి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పంటను ఇ-క్రాప్‌లో నమోదు చేసిన తర్వాత రైతులు తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించుకోవాలని సభ్యులకు తెలిపారు. మినుము పంటలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి నివారించుకుంటే మినుము పంట ఆశాజనకంగా ఉంటుందని ఆమె తెలిపారు. అనంతరం వ్యవసాయ అనుబంధ రంగాల అంశాల మీద కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ మండలి బోర్డు ఛైర్‌పర్సన్ జంగం వరలక్ష్మి, ఎఒ జరీనా, బోర్డు సభ్యులు వివిఎ ఆకాంక్ష పాల్గొన్నారు.

'లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటే సహించం'

ప్రజాశక్తి - కైకలూరు

నారా లోకేష్ పాదయాత్రకు అడ్డంకులు సృష్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తే సహించేది లేదని టిడిపి నాయకులు హెచ్చరించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ఎలాగైనా ఆపాలనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం నాయకులను పాదయాత్రలో కలవనివ్వకుండా అడ్డుకుంటుందన్నారు. అదే తరహాలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్‌పై పోలీస్ అధికారులు కేవలం ఆర్యవైశ్యుడు అనే నెపంతో చేయి చేసుకోవటాన్ని దుశ్చర్యగా ఖండించారు. నిరసనగా మహాత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి జాని, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పైడిమర్రి జెవిఎస్.మాల్యాద్రి, బిసి సాధికార కమిటీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు

ఒ.యస్. నెం. 213/2016

బిట్వీన్:

గాదంశెట్టి సురేష్‌బాబు -వాది

మరియు

పామర్తి జగదీష్ -ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల దావాలో ప్రతివాది అయిన పామర్తి జగదీష్, S/o. గోవర్ధనరావు, డోరు నెం. 16B-16-13/2, పుష్పలీల నగర్, తంగెళ్ళమూడి, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టు వారి ఎదుట **ది. 24-2-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని తమ ఆక్షేపణలు తెలియపరచుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమయినది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్లు

ఏలూరు — శ్రీరామనగర్, ఏలూరు
ది.10-2-23 — ప॥గో॥జిల్లా

దస్తావేజులు పడిపోయినవి

నా క్లయింటును, పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం గ్రామం, ఆకుల నరసింహమూర్తి గారి వీధి, డోర్ నెం. 8-3-2, లేటు కటకంశెట్టి సత్యనారాయణ గారి భార్య ఛాయాదేవి గారి ఇంటి ఆస్తి బాపతు లింక్ దస్తావేజులు అనగా సదరు డోర్ నెంబరు దాఖల ఆర్‌సిసి బిల్డింగ్ మరియు అందలి కార్ షెడ్ దాఖల శ్రీ నరసాపురం సబ్ రిజిస్ట్రార్ నందలి రిజిస్ట్రీ కాబడిన **క్రయ దస్తావేజు నెం. 2337/1974 రు** ను, నా క్లయింటు ది. 08-02-2023వ తేదీన నడుచుకుంటూ ఫోటోస్టాట్ తీయించుటకు తీసుకుని వెళ్ళగా సదరు దస్తావేజు స్టీమర్ రోడ్డు, నరసాపురంలో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైననూ సదరు దస్తావేజు దొరికిన ఎడల వెంటనే ఈక్రింది అడ్రస్ నందు గాని, పైన తెలిపిన మా క్లయింట్ అడ్రస్ నందు గాని ఇవ్వగలరు.

రాయప్రోలు రాజ కిరణ్
రాయప్రోలు అజీజున్నీసా బేగమ్
న్యాయవాదులు, డోర్ నెం.21-1-6,
సొసైటీ రోడ్, తణుకు, సెల్: 8341437279

In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru

I.A. No. /2022, I.A. No. 179/2022
I.A. No. 46/2020, O.S. No. 73/2020

Between:
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
R-2: Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
R-3: Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
R-4: Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా ఆయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు — **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 — అడ్వకేట్, ఏలూరు

In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru

I.A. No. /2022, I.A. No. /2022
I.A. No. 180/2022, O.S. No. 73/2020

Between:
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
R-2: Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
R-3: Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
R-4: Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా ఆయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు — **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 — అడ్వకేట్, ఏలూరు

In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru

I.A. No. /2022, I.A. No. 178/2022
I.A. No. 46/2020, O.S. No. 73/2020

Between:
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
R-2: Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
R-3: Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
R-4: Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా ఆయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు — **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 — అడ్వకేట్, ఏలూరు

In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru

I.A. No. /2022, I.A. No. /2022
I.A. No. 181/2022, O.S. No. 73/2020

Between:
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
R-2: Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
R-3: Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
R-4: Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా ఆయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు — **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 — అడ్వకేట్, ఏలూరు